పీఈ సెట్ నిర్వహణతో వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు

పీయూ వీసీని సన్మానిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 7 : పీఈ సెట్ నిర్వహణతో పాలమూరు యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపుతో పాటు మరిన్ని సెట్‌ల నిర్వహణకు అవకాశం లభిస్తుందని పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు మంగళవారం వర్సిటీ పరిపాలన భవనంలో వీసీని కలిసి శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. సెట్‌లు సమర్థవంతంగా నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీకి మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ విలియం, బాలరాజు, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కురుమూర్తి, వాలీబాల్ సెక్రటరీ చెన్న వీరయ్య, ప్రొఫెసర్ సత్యభాస్కర్‌రెడ్డి, పీడీలు వెంకటరెడ్డి, రజిని, యుగంధర్, పీయూ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

నారాయణపేట, జనవరి 7 : కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేలా పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిసెంబర్ 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలోని 6,912 కేసులను పరిష్కరించి రాష్ట్రంలో 14వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. 2025లో జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి షెడ్యూల్‌ను తెలియజేశారు. ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో న్యాయమూర్తులు వింధ్యానాయక్, మహ్మద్ ఉమర్, జాకియా సుల్తానా, ఫర్హీన్ బేగం, లీగల్ ఎయిడ్ కౌన్సిలర్లు లక్ష్మీపతి గౌడ్, నాగేశ్వరి, డీఎస్పీ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు

నవాబ్‌పేట, జనవరి 7 : వృద్ధులను సంరక్షించేందుకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో న్యాయ చట్టాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2007 సంవత్సరంలో ఏర్పాటు చేసిన చట్టం ప్రకారం తల్లిదండ్రులను తమ పిల్లలు పోషించకపోతే వారి ద్వారా సంక్రమించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చని సూచించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జగపతిరావు, నాగభూషణం, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, ఫోరం సభ్యులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, రాజసింహుడు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, జనవరి 7 : వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో మాగనూర్, మరికల్, మక్తల్, పెద్ద చింతకుంట, అప్పంపల్లి, కోస్గి ప్రాంతాల్ల 6 బ్లాక్ పాయింట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈనెల 10న రోడ్డు భద్రతా మాసోత్సవాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులతో ర్యాలీ, 18న మక్తల్‌లో ఆటో డ్రైవర్లు, కమర్షియల్ టాక్స్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మక్తల్, కోస్గి సర్కిళ్ల పరిధిలో సీసీ కెమెరాల నిఘాతో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, వైర్‌లెస్ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గడువులోపు అనుమతులు ఇవ్వాలి..

పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత గడువులోపు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన టీజీ ఐపాస్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమల శాఖ జీఎం మహేశ్వర్ మాట్లాడుతూ నవంబర్ 7 నుంచి ఈనెల 6 వరకు పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి 14 దరఖాస్తులు రాగా, 9 మంజూరు చేసినట్లు చెప్పారు. టీప్రైడ్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు చెందిన 17 దరఖాస్తులకు సబ్సిడీ మంజూరు చేసినట్లు తెలిపారు.

ఎక్స్‌పోర్ట్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలి..

జిల్లా డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీ శైలజ, లాజిస్టిక్ ఇండస్ట్రీస్ కామర్స్ రీజినల్ డైరెక్టర్ అపర్ణ తదితరులతో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీసీలో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా వరి ధాన్యం, పత్తి, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో వంద ఎకరాల్లో మునగ ఆకు సాగు చేస్తున్నారని, పొడి చేసి ఎక్స్‌పోర్ట్ చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. శీతా ఫలాల ప్రాసెసింగ్ కూడా జరుగుతుందని, ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నాబార్డు అధికారి షణ్ముఖచారి కోరారు. సమావేశాల్లో డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, ఆర్టీవో మేఘాగాంధీ, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారిణి శాలిని, ఆర్ అండ్‌బీ ఈఈ రాములు, పీఆర్ ఈఈ హీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఘటనా స్థలంలో లారీ కింద నుజ్జునుజ్జయిన స్కూటీ

మూసాపేట, జనవరి 7 : మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి జాతీయ రహదారిపై స్కూటీని లారీ ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికులు, ఎస్సై వేణు కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని రామమ్మపేటకు చెందిన శివనారాయణ(65) వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్నాడన్నారు. మంగళవారం వనపర్తికి ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామ జాతీయ రహదారిపై లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ క్రమంలో స్కూటీని లారీ కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో శివనారాయణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై వేణు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గొల్లపల్లి వద్ద మరో వ్యక్తి..

జడ్చర్ల, జనవరి 7 : జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి వద్ద 44వ జాతీయరహదారిపై రోడ్డు దాటుతున్న దామోదర్‌రెడ్డి (85)అనే వ్యక్తిని బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నవాబ్‌పేట మండలం కారూరుకు చెందిన దామోదర్‌రెడ్డి సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఓ దవాఖానకు చికిత్స నిమిత్తం వెళ్లి రాత్రి అక్కడే ఉన్నాడన్నారు. తిరిగి మంగళవారం ఉదయం కారూరుకు బైక్‌పై వెళ్తూ మార్గమధ్యంలో జడ్చర్ల మండలంలోని మాచారం గ్రామ పంచాయతీలోని చాకలిగడ్డతండా వద్ద జాతీయరహదారి పక్కన బైక్‌ను నిలిపి రోడ్డుకు అటు అవతలి వైపు ఉన్న హోటల్‌లో టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సు వేగంగా ఢీకొట్టడంతో టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా దవాఖాన మార్చురీకి తరలించి, మృతుడి కుమారుడు సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి

నారాయణపేట, జనవరి 7 : మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో లూయీ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి జయ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. అంధుల కోసం బ్రెయిలీ అందించిన సేవలను కొనియాడారు.

అంధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సంక్షేమశాఖ అధికారిణి జయ

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Karunakar S/o Mahipal Reddy, age 26 years, Occ: Business, R/o H.No. 9-61/1, Dandu Village, Makthal Mandal, Narayanpet Dist., **Applicant/ Borrower,** Goudi Narsingamma W/o G.Kurmi Reddy age 37 years, Occ: Business, R/o H.No.9-61, Dandu Village, Makthal Mandal, Narayanpet Dist., **Co-Borrowers/Prop.Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

The Residential open Plot No.79 admeasuring 150.00 Sq. Yrds situated at Hanuman Colony, Makthal Village & Mandal, Narayanpet Dist., which is bounded as under: **East:** Plot No.69, **West:** 25" Road, **North:** 30"Road, **South:** Plot No. 80.

MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

IN THE COURT OF THE HON'BLE PRL, JUNIOR CIVIL JUDGE AT : MAHABUB NAGAR
O.S.NO. 460 OF 2024

Between:
Amudala Rukkaiah S/o. Sayanna, aged: 60 years, occ : Agriculture R/o. Gadiryal Village, Mohammadabad Mandal, Mahabubnagar Dist ... Plaintiff
And
1. The Tahasildar, Mohammedabad Mandal,
2. To Whom so ever concern ... Defendants

NOTICE

To
1. The Tahasildar, Mohammedabad Mandal,
2. To Whom so ever concern

Take notice that the above suit O.S No. 460/2024 filed by the plaintiff for declaration of Plaintiff as Legal heir of deceased Harijan Buggaiah S/o Sayanna Leaving behind the Plaintiff as his sole Legal heir herein and the above suit is posted on 21-01-2025 for hearing, if anybody having any objection or claims what soever appear before the said Hon'ble court at 10.30 A.M on 21-01-2025, failing which the matter will be decided exparte.

"By the order of the Court"

E.RAMULU, T.NARSIMULU
Advocates, Opp: Vishnu Apartment, Near Yerra Sathyam Chourastha, Station road, Mahabubnagar. Cell No. 9440296106

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Chakali Narsimulu S/o Narsappa. age 51 years, Occ: Business, R/o H.No. 3-42, Gundmal Village, Kosgi Mandal, Narayanpet Dist., **Applicant/ Borrower,** Suguna W/o Chakali Narsimulu age 43 years, Occ: Business, R/o H.No.3-42, Gundmal Village, Kosgi Mandal, Narayapet Dist., **Co-Borrowers/ /Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

The Residential open Plot admeasuring 121.00 Sq.Yrds situated at Gundmal Village, Kosgi Mandal, Narayanpet Dist., which is bounded as under: **East:** Vendor Open Place, **West:** Road, **North:** Vendors Open Place, **South:** Others Open Place.

MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **KOTHAKAPU SARADHA** R/o H.No: 9-130, Putanpally Village, Gadwal Mandal, Jogulamba Gadwal Dist. T.G., here by state that my name was recorded in my husband Passport No.**M 6349141** as **KATTA KAPU SHARADHA** W/o **KATTA KAPU BHEEM REDDY.** I have changed my name as **KOTHA KAPU SARADHA** W/o **KOTHA KAPU BHEEM REDDY**

NT-MBNR

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

నాణ్యమైన భోజనం అందించాలి

మాగనూరు, జనవరి 7 : మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఇన్‌చార్జి ఎంఈవో అనిల్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల వనరుల కేంద్రంలో మండలంలోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

హాస్టల్ తనిఖీ..

మాగనూరు, జనవరి 7 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో రహ్మతుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్‌వో రాధికకు సూచించారు.

గంజాయి సాగు చేసిన యువకుడి బైండోవర్

మిడ్జిల్, జనవరి 7 : బొందల గడ్డలో గంజాయి మొక్కలు పెంచుతున్న ఓ యువకుడిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై నాగార్జున తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన బాబ్జీ కొన్నేళ్లుగా మిడ్జిల్ మండల కేంద్రంలో వెల్డింగ్ పనులు చేస్తూ బంధువుల వద్ద ఉండేవాడు. గంజాయికి అలవాటుపడ్డ బాబ్జీ ఎవరికీ తెలియకుండా మిడ్జిల్ మండల కేంద్రంలోని బొందల గడ్డలో నాలుగు గంజాయి మొక్కలు పెంచాడు. బొందల గడ్డలో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారంతో సీఐ విప్లవ్ రెడ్డి, ఎస్సై నాగరాజు సిబ్బందితో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. బాబ్జీని అదుపులోకి తీసుకొని తాసీల్దార్ రాజు ఎదుట బైండోవర్ చేశారు. రూ.లక్ష విలువైన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బాలానగర్, జనవరి 7 : పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సాగర్‌సింగ్ సర్దార్ (26) బాలానగర్ మండలంలోని పరిశ్రమలో పని కోసం సోమవారం రాత్రి వచ్చాడు. తనకు తెలిసిన మిత్రుడి ఇంట్లో ఉన్నాడు. మంగళవారం ఉదయం రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా, అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష కోసం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

పరిశ్రమ మేనేజర్‌పై కేసు నమోదు

బాలానగర్, జనవరి 7 : పరిశ్రమలో బాలకార్మికులతో పని చేయిస్తున్నాడన్న ఆరోపణపై బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండేడు శివారులో గల వినాయక మైక్రాన్ పరిశ్రమ మేనేజర్ జయశీల్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న ఓ బాలుడిని పట్టుకున్న మహబూబ్‌నగర్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బాసిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలి

- ట్రైనీ కలెక్టర్ గరీమనరుల

మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ గరీమనరుల

నారాయణపేట టౌన్, జనవరి 7 : ఈనెల 25వ తేదీన 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ గరీమనరుల అన్నారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఓటరు దినోత్సవం నిర్వహణపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 ఏండ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో ర్యాలీ నిర్వహించాలని, ఎపిక్ కార్డు పంపిణీ, పోస్టర్, బ్యానర్లు ఏర్పాటు చేయించి, గ్రామాల్లో టాంటాం వేయించాలన్నారు. పాఠశాల, కళాశాలల్లో క్విజ్ పోటీలు నిర్వహించాలని, రంగోళి, ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఆర్డీవో రాంచందర్, డిప్యూటీ సీఈవో జ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల బ్రోచర్లు ఆవిష్కరణ

రోడ్డు భద్రత నియమాలు వివరిస్తున్న కమిషనర్ కిషన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జనవరి 7 : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు-2025 నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా రవాణాశాఖ కమిషనర్ కిషన్ ఆధ్వర్యంలో నిబంధనలపై రూపొందించిన బ్రోచర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోడ్డు ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కిషన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా నాలుగు, ఆపైన చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్ట్ విధిగా ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిద్దాం-రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంవీఐలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

10న ఎమ్మెల్యేల ఇంటి ఎదుట నిరసనలు

నారాయపేట పీపీ యూనిట్‌లో వినతి పత్రం సమర్పిస్తున్న ఆశ కార్యకర్తలు

నారాయణపేట, జనవరి 7 : ఈనెల 10వ తేదీన ఆశ కార్యకర్తలు ఎమ్మెల్యేల ఇంటి ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలామణి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పీపీ యూనిట్ అధికారి, మండలంలోని కోట కొండ పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రతిభకు ఆశా కార్యకర్తలు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 మంది ఎమ్మెల్యేల ఇంటి ఎదుట నిరసనలు చేపట్టాలని యూనియన్(సీఐటీయూ) పిలుపునిచ్చిందన్నారు. ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో కనీస వేతనం రూ.18 వేలు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలని నిరసనలు కొనసాగిస్తామన్నారు. పేట నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటి ఎదుట జరిగే నిరసనలో కోటకొండ పీహెచ్‌సీ ఆశలు పాల్గొంటారని తెలిపారు. రాధిక, బాలనర్సమ్మ, అంజమ్మ, మంజుల, మహేశ్వరి వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపడుతాం..

మాగనూరు, జనవరి 7 : ఆశవర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపడుతామని మాగనూరు, కృష్ణ మండలాల ఆశవర్కర్లు మంగళవారం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 10వ తేదీన కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కోసం ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు.

పల్లె దవాఖానలతో అందుబాటులో వైద్యం

- ఎంపీ డీకే అరుణ

పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మద్దూర్ (కొత్తపల్లి) జనవరి 7 : వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం మద్దూర్ మండలంలోని జాదవరావుపల్లి, రేణివట్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన పల్లె దవఖానలను ఎంపీ ప్రారంభించారు. ఆసుపత్రుల్లో సౌకర్యాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 259 గ్రామ పంచాయతీల్లో 59 పల్లె దవఖానాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రేణివట్లలో బీజేపీ,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 7 : ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అర్బన్ తాసీల్దార్ దస్సీరాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌పై కాలయాపన చేయకుండా బీసీ రిజర్వేషన్లు 29శాతం నుంచి 42 శాతానికి పెంచాలన్నారు. ఆరు గ్యారెంటీలతో అధికారం చేపట్టి అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో గోపాల్‌గౌడ్, రమేశ్, సుబ్రమణ్యం, శంకర్, రాజేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.8,559 ధర పలికిన కందులు

నారాయణపేట టౌన్, జనవరి 7 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 184 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.8,559, కనిష్ఠంగా రూ.6,600 ధర పలికాయి. అదేవిధంగా 1,663 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.8,407 కనిష్ఠంగా రూ. 7,088 ధర పలికాయి. 64 క్వింటాళ్ల సోనరకం ధాన్యం విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.2,466, కనిష్ఠంగా రూ.1,500 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 7 : గద్వాల జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఈనెల 9వ తేదీన ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాలికల అండర్-19 క్రికెట్ జట్టు కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాపిరెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్, బోనఫైడ్‌తో గురువారం ఉదయం 9గంటలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు కోచ్ శ్రీనివాస్‌రెడ్డి 98859 55633 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

దేవరకద్ర: నిరసన తెలుపుతున్న నాయకులు

దేవరకద్ర, జనవరి 7 : కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత రైతు ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జగజిత్‌సింగ్ 42 రోజులుగా ధర్నా చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం తగదన్నారు. నల్లచట్టాన్ని వ్యతిరేకిస్తూ ఎంఎస్పీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు ఐక్య వేదిక రాష్ట్ర సభ్యులు సీహెచ్ రాంచందర్, బాల స్వామి, రాము, వెంకన్న, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, బాలు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుడిని విధుల్లోకి తీసుకోవాలి

ఊట్కూర్, జనవరి 7 : మండలంలోని తిప్రాస్‌పల్లి క్షేత్ర సహాయకుడిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు భీంశప్ప, కృష్ణ, రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్డీవో మొగులప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి తిప్రాస్‌పల్లి ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు వెంకటేశ్‌ను రాజకీయ కక్షలతో విధులకు హాజరు కాకూడదని ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాజకీయ ప్రోద్బలంతో ఉద్యోగులను బలి చేయడం సరికాదని, ఉన్నతాధికారులు స్పందించి సస్పెన్షన్ తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), జనవరి 7 : చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్ సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు మోహన్‌గౌడ్ మంగళవారం వెంకటేశ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మిడ్జిల్, జనవరి 7 : వాహనాలు నడిపే ప్రతిఒకరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని పోలీసులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద ట్రాఫిక్ రూల్స్‌పై వాహదారులకు అవగాహన కల్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భూత్పూర్, జనవరి 7 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి రబ్బా అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమావేశాన్ని నిర్వహించారు. హెచ్ఎంపీవీ వైరస్‌పై భయాందోళన చెందవద్దని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్షయవ్యాధి వైద్య శిబిరం

భూత్పూర్, జనవరి 7 : మండలంలోని కరివెనలో క్షయ వ్యాధి వైద్య శిబిరాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 62మంది అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి, 16మంది శ్యాంపుల్స్ పంపినట్లు సూపర్‌వైజర్ రాజు తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

నవాబ్‌పేట, జనవరి7 : మండలంలోని కొల్లూరులో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో గ్రామాలకు చెందిన జట్లు మంగళవారం హోరాహోరీగా తలపడ్డాయి. ఓపెన్ టూ ఆల్ విభాగంలో 16 జట్లు పాల్గొనగా, రూరల్ విభాగంలో 28 జట్లు టోర్నీలో తలపడ్డాయి. రెండవ రోజు సాయంత్రం వరకు రూరల్ విభాగంలో ఫైనల్‌లో చిన్న దేపల్లి, షాద్‌నగర్ జట్లు తలపడగా, షాద్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. కాగా ఓపెన్ టూ ఆల్ పోటీలు రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో కొనసాగాయి.

అత్యాశకు పోతే.. ఖాతా ఖాళీ

బాలానగర్ (రాజాపూర్), జనవరి 7 : డబ్బులు డిపాజిట్ చేస్తే ఎక్కువ కమీషన్ వస్తుందన్న ఓ అపరిచిత వ్యక్తి పంపిన లింకును ఓపెన్ చేసి ఖాతాలో సొమ్మును పోగొట్టుకున్న ఘటన రాజాపూర్ మండలంలో చోటుచేసుకున్నది. రాజాపూర్ ఎస్సై రవి కథనం ప్రకారం.. రాయపల్లికి చెందిన లింగమయ్య వాట్సాప్‌కు డబ్బులు డిపాజిట్ చేస్తే అత్యధికంగా కమీషన్ వస్తుందనే సమాచారంతో ఓ లింక్ వచ్చింది. లింగమయ్య సదరు వ్యక్తి పంపిన నెంబరుకు తన బ్యాంకు ఖాతాలోని రూ.4,632 పంపించాడు. తర్వాత అటు నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతిపై లైంగికదాడి

మహబూబ్‌నగర్, జనవరి 7 : జిల్లా కేంద్రంలో యువతి ఫిర్యాదు మేరకు లైంగికదాడి కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్న యువతిని అదే దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కల్యాణ్ నూతన సంవత్సరం సందర్భంగా కలిసి లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ విచారణ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు.